సాక్షి
ఏలూరు
గురువారం । 11 । మే । 2023



సంచుల కొరత రానివ్వం

రైతులను ఆదుకునేందుకు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో గోనె సంచుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. 8లో ▸



బ్రహ్మోత్సవాలు

గోకుల తిరుమల పారిజాతగిరిలో రేపటి నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో ▸

ఉక్కుపాదం

గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్ట మైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులను అణచివేయాలని డీఐజీ జీవీజీ అశోక్‌కు మార్ ఆదేశించారు. 8లో



న్యూస్‌రీల్

ఈ- స్టాంపింగ్ చట్టబద్ధమే



రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ కే.అబ్రహామ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అఫిడవిట్లకు, అగ్రిమెంట్లకు, దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్టాంపు పేపర్లే అక్కర్లేదని, ఈ- స్టాంపింగ్ అయినా చట్టబద్ధమేనని ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ డీఐజీ కే.అబ్రాహాం తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు సమాంతరంగా స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌చే ఈ-స్టాంపింగ్ విధానాన్ని ఇటీవలే ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ-స్టాంపింగ్ విధానంలో ప్రజలు తమకు అవసరమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు పొందవచ్చన్నారు. ఈ-స్టాంపింగ్ ద్వారా వేసిన స్టాంపులు, సాధారణ నాన్ జ్యుడీషియల్ బాండు పేపర్లతో సమానమైన చలామణీ ఉన్నాయన్నారు. వీటిని దస్తావేజుల రిజిస్ట్రేషన్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. ఈ- స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం లైసెన్సుల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటే, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సత్వరమే లైసెన్సులు మంజూరు చేస్తుందన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఏలూరు, భీమవరం రిజిస్ట్రేషన్ జిల్లాల్లో విస్తరించిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రజల కోసం నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పది, ఇరవై, యాభై, వంద రూపాయల ముఖవిలువ గల స్టాంపులు ఆయా సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల్లోని కౌంటర్లలోనూ, అధీకృత స్టాంపువెండర్ల వద్ద ఇవి అమ్మకానికి ఉన్నాయన్నారు.

మొక్కజొన్న రైతులకు పది రోజుల్లోనే నగదు

ముసునూరు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న విక్రయించిన రైతులకు 10 నుంచి 15 రోజుల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ బి.ఆదినారాయణ చెప్పారు. మండలంలోని కొర్లగుంట వ్యవసాయ సొసైటీ వద్ద బుధవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తేమ 14 శాతం కన్నా తక్కువగా ఉన్న మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని, రైతులకు క్వింటాలుకు రూ.1962 మద్దతు ధరకు కొనుగోలు చేసిన 10 నుంచి 15 రోజుల్లోగా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడం జరుగుతుందన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ప్రభుత్వం బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షలకు ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు నగరంలోని 8 కేంద్రాల్లో మొత్తం 3715 మందికి 3277 మంది హాజరయ్యారు. వీరిలో 1199 మంది బాలికలు, 2078 మంది బాలురు ఉన్నారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

ఏలూరు(మెట్రో): హెచ్‌ఆర్‌ఏను 4 శాతం పెంచిందని ఏపీ ఎన్జీవో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నెరుసు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంపు వర్తిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో పనిచేస్తున్న సుమారు 10,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ పెంపు వర్తిస్తుంది.

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గత 40 రోజులకు నగదు రూపేణా శ్రీవారికి రూ.3,70,03,230 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 804 గ్రాముల బంగారం, 10.705 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించాయన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.1,000, రూ. 500 నోట్లు ద్వారా రూ.18,500 లభించినట్టు చెప్పారు.

తమ్మిలేరుకు మహర్దశ

- ముమ్మరంగా జలాశయం మరమ్మతు పనులు
- ప్రాజెక్టు ఆధునీకరణకు జైకా నిధులు





నాగిరెడ్డిగూడెం సమీపంలో తమ్మిలేరు జలాశయం మరమ్మతు పనుల్లో కాంక్రీట్ గోడలు, ఎడమ కాల్వ ఎర్త్ వర్క్ పనులు పూర్తయిన దృశ్యం

చింతలపూడి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. సాగునీటికి రైతులు ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయం ఎడమ కాల్వ మరమ్మతు పనులను అధికారులు చేపట్టారు. ప్రాజెక్టు ఆధునికీకరణ నిమిత్తం జపాన్ ఆర్థిక బ్యాంక్ నుంచి 2018 జూలై నెలలో రూ.16.91 కోట్ల రుణం మంజూరైంది. నిధులు మంజూరైనా అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే విషయంలో అశ్రద్ధ చేయడంతో పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ్మిలేరు ఆధునికీకరణపై దృష్టి సారించింది. ప్రాజెక్టు పంట కాల్వల మరమ్మతుల కోసం ఇటీవల రూ.13 కోట్లకు టెండర్లు ఖరారు చేసి ఎడమ కాల్వ మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు. ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తయితే జలాశయం నుంచి సాగునీటి సరఫరాకు అడ్డంకులు తొలగిపోతాయి. ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాల్వలతో పాటు మంకొల్లు కాల్వలకు సంబంధించి 70 కిలోమీటర్ల మేర 765 పనులను అధికారులు గుర్తించారు. వాటిలో అవసరమైన పనులను తొలుత ప్రారంభించారు.

రూ. కోటితో ప్రధాన కట్ట మరమ్మతులు

పంటకాల్వల్లో పూడిక తీతతో పాటు స్లూయిజ్‌ల మరమ్మతులు, కాల్వల గేట్లు అవసరమైతే పునర్నిర్మాణం కూడా చేపడుతున్నారు. వీటితో పాటు జలాశయం ప్రధాన కట్టను కూడ రూ.కోటితో మరమ్మతులు చేపడుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలో ఇన్స్‌పెక్షన్ రూమ్, జనరేటర్ రూమ్ నిర్మాణాలు కూడ చేపడతారు. తొలకరి నాటికి పంట కాల్వల పనులు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా అధికారులు సైతం ప్రాజెక్టు మరమ్మతు పనులను ఎప్పటికప్పుడు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద రిజర్వాయరు ఎగువ భాగంలో 20,230 ఎకరాలు, దిగువ భాగంలో ఏలూరు వెళ్ళే ఇరుపక్కలా 15 ఏటి కాలువల ద్వారా 14,200 ఎకరాలు సాగవుతున్నాయి. ఏలూరు జిల్లాలోని తలార్లపల్లి, యర్రంపల్లి, యడవల్లి, కళ్యాణంపాడు, తువ్వచెలక రాయుడుపాలెం, గ్రామాలకు చెందిన 475 ఎకరాల పల్లం భూములకు 3,769 ఎకరాల మెరక భూములకు నీటి సరఫరా జరుగుతుంది. అదేవిధంగా పోలవరం, చాట్రాయి, తుమ్మగూడెం, మంకొల్లు, సోమవరం గ్రామాలలో 1,855 ఎకరాల పల్లం భూములకు, 3,070 ఎకరాల మెరక భూములకు సాగునీరు అందుతుంది. గత 40 ఏళ్ళుగా మరమ్మత్తులకు నోచుకోని ఈ ప్రాజెక్టుకు ప్రస్తుత ప్రభుత్వం శాశ్వత మరమ్మతులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు ఆధునికీకరిస్తున్నాం



జైకా నిధులతో తమ్మిలేరు ప్రాజెక్టును ఆధునీకరిస్తున్నాం. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా పంటకాల్వల మరమ్మతుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ చొరవతో జపాన్ ఆర్థిక సంస్థ నుంచి రుణం మంజూరైంది. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం.

– ఉన్నమట్ల ఎలీజా, శాసన సభ్యులు, చింతలపూడి

వేగంగా మరమ్మతు పనులు



తమ్మిలేరు పంట కాల్వల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వేసవిలో కాల్వలను పటిష్ట పరచడానికి చర్యలు తీసుకున్నాం. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించి తగిన సూచనలు ఇస్తున్నారు. పనులు త్వరలోనే పూర్తవుతాయి.

– బి.శ్రీనివాసరావు-డీఈ , తమ్మిలేరు ప్రాజెక్టు

ఎన్నికల వరకూ ఇదే స్ఫూర్తితో సాగాలి



తాడేపల్లిలో ఎమ్మెల్యే వాసుబాబును అభినందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు దాటి, 153వ రోజుకు చేరిందని, త్వరలోనే కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేస్తామని వాసుబాబు ముఖ్యమంత్రి జగన్‌కు తెలపగా ఆయన వాసుబాబును అభినందించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల వరకూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని వాసుబాబుకు సూచించారు. ఇప్పటి వరకూ గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలు, వాటిలో పరిష్కారం చేసినవి, ప్రతిపాదనలు చేసినవి ముఖ్యమంత్రికి వివరించారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసేలా చూడాలని వాసుబాబు కోరారు. నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లు, వంతెనలు శిథిలావస్థకు చేరాయని, వాటి నిర్మాణాలకు నిధులు మంజూరుచేయాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రి గణపవరం వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీలలో ఇంకా మిగిలిన వాటి గురించి ప్రస్తావించి, త్వరగా మంజూరు చేయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

'జగనన్నకు చెబుదాం'తో వేగవంతమైన పరిష్కారం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): అర్జీల పరిష్కారంలో వేగవంతమైన నాణ్యమైన పరిష్కారమే ధ్యేయంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యంకాని సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను తమ సమీపంలోని సచివాలయాల్లో, సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో కూడా అందించవచ్చన్నారు. టోల్ ఫ్రీ నెంబరు నెట్ వర్క్ బిజీ అని వచ్చిన సమయంలో జేకేసీ వెబ్ సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదుదారుడి ఫోన్ నెంబరు, సమస్య చెబితే తిరిగి వారికి ఫోన్ కాల్ వచ్చి వివరాలు స్వీకరిస్తారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న స్పందన అర్జీల స్వీకరణ కార్యకమాన్ని ప్రతి సోమవారం నిరంతరాయంగా నిర్వహిస్తారని చెప్పారు. సంతృప్తికర పరిష్కారం అందించిన మొదటి మూడు జిల్లాల్లో ఏలూరు జిల్లా ఒకటిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం కంటే మరింత మెరుగ్గా అర్జీలు పరిష్కారం అవుతాయన్నారు.

జిల్లాలో ప్రతిరోజు ఉదయం 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం సరైన రీతిలో జరగనట్లు గుర్తిస్తే తొలిగా షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నామని ఇదే క్రమంలో మూడు నోటీసులు జారీ అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. స్పందన అర్జీల్లో సివిల్, భూమి వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిలో ప్రైవేటు భూములకు సంబంధించి ఎక్కువగానే ఉంటున్నాయన్నారు. ఇలాంటి విషయంలో సంబంధిత తహసీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేయించి అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారుడికి అందించి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రిజిస్ట్రేషన్ సిబ్బందిపై చర్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ శాఖలో వెలుగు చూసిన అవినీతి వ్యవహారంలో సంబంధిత అధికారులు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ కే అబ్రాహామ్ తెలిపారు. ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కేసులో సీనియర్ అసిస్టెంట్ పీ.జోగేశ్వరరావును విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఇటీవల నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ నిర్వహించిన సోదాల్లో రూ.50 వేలు లెక్క లేని సొమ్ము లభించిన వ్యవహారంలో సంబంధిత నరసాపురం సబ్ రిజిస్ట్రార్ ఎం.వీరభద్రరావును ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఆడిట్ విభాగానికి, సీనియర్ అసిస్టెంట్ పీ.శరాబంధు రాజును భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిపాలనా విభాగానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు తెలిపారు. నరసాపురం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వీ.సురేష్‌ను నియమించినట్లు తెలిపారు.

13, 14 తేదీల్లో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూత్ బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి జట్ల ఎంపికను ఈనెల 13,14 తేదీలలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకూ మాంటిస్సోరి స్కూల్ గ్రౌండ్స్ ఉల్లంపర్రు, పాలకొల్లులో జరిగే రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు. జిల్లా స్థాయి బాలికల జట్టు ఎంపికను ఈ నెల 13న ఏలూరులోని కస్తూరిబా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో సాయంత్రం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలుర జట్టు ఎంపికను ఈనెల 14న సాయంత్రం 3 గంటలకు మార్టేరులోని ఎస్‌వీజీజడ్‌పి హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 2007, జనవరి 1 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి జగన్

- వారం రోజుల్లోనే ధాన్యం సొమ్ములు అందజేత
- కళ్లాల్లో ధాన్యం పరిశీలించిన మంత్రులు కొట్టు, కాకాని, కారుమూరి



కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి



మండపాకలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: రైతులకు సకాలంలో సొమ్ములు అందచేసి రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిలిచారని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. పెంటపాడు మండలంలోని అలంపురం గ్రామ రెతులను బుధవారం సాయంత్రం కలిసి మాట్లాడారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ రైతులకు సకాలంలో సొమ్ములు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కళ్ళాల్లో పరిశీలన చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరిస్తున్నారని చెప్పారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో తన స్వార్థం కోసం రైతులను కలిసి అవాస్తవాలు చెప్పడం చంద్రబాబు దుర్నీతిని తెలియచేస్తుందన్నారు. చంద్రబాబు పులకేసి మాదిరి వేషాలు వేయడం పట్ల ప్రజలు నవ్వుతున్నారన్నారు. 14 సంవత్సరాలు పాలన చేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఎందుకు ఇవ్వలేదని చంద్రబాబును సూటిగా ప్రశ్నించానని కొట్టు గుర్తు చేశారు. రైతులను ఆదుకొన్న ప్రభుత్వం నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు బీమా చెల్లించిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అన్నారు. పంటలు నష్టపోతే ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రైతులను జగన్ ఆదుకున్నారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో రైతులకు సొమ్ములు అందచేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు అందచేయడంతో ప్రభుత్వం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తుందన్నారు.

రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలి: కాకాని

మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయంలోను రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమర్థతను ప్రజలు గమనిస్తున్నారు. రైతులకు ఎలాంటి కష్టం వచ్చిన సకాలంలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులను ఆదుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. రైతులు సమస్యలను తెలుసుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లను, మంత్రులను సమాయత్తం చేశారన్నారు. పంటనష్టపోయిన రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. చందబాబు హయాంలో రెండేళ్లపాటు ఇన్‌పుట్ సబ్సిడీ వేయలేదని రైతులకు ఈ విషయం స్పష్టంగా తెలుసన్నారు. విత్తనాల పంపిణీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అంశాలకు సంబంధించి రూ.5 వేల కోట్ల బకాయిలు పెట్టి దిగిపోయిన ప్రబుద్ధుడు చంద్రబాబు అని విమర్శించారు. రైతులు నష్టపోవాలి, రైతులను రెచ్చగొట్టాలి,జగన్‌పై వ్యతిరేకతను సృష్టించాలని దుర్బుద్ధితో రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. జగన్మోహనరెడ్డి స్పందిస్తాడని తెలిసి చంద్రబాబు ముందుగానే పరుగెడుతున్నాడన్నారు.

ప్రతి గింజా కొంటాం

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ప్రస్తుత రబీ పంటకు సంబంధించి ఇంతవరకు రూ. 320 కోట్ల విలువైన 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు, దెబ్బతిన్న ధాన్యం కొనుగోలు, తదితర అంశాలను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో రబీ పంటకు సంబంధించి ఇంతవరకు 320 కోట్ల రూపాయల విలువైన 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇందుకు గాను ఇప్పటి వరకు 297 కోట్ల రూపాయలు(93 శాతం) రైతుల ఖాతాకు జమచేశామన్నారు. ధాన్యం సేకరించిన 21 రోజుల లోపే సొమ్ములు జమచేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణలో తొలుత 75 బస్తాలు ఉన్న పరిమితిని రైతుల విజ్ఞప్తి మేరకు 105 కు ప్రభుత్వం పెంచామని చెప్పారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్

ఏలూరు(మెట్రో): పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ప్రారంభించామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లు, సిడిపివోలు, ఎంఈఓ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మండలంలో జరుగుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 80 శాతం ఉత్తీర్ణత సాధించడానికి జిల్లా విద్యాశాఖ కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న నాడు నేడు అదనపు తరగతుల నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ ఆదిత్య భరత్, జెడ్పీ సీఈవో రవికుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది మొసలి కన్నీరు

తణుకు టౌన్: ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రతిపక్ష పార్టీ నాయకులు రాజకీయాల కోసం రైతులను వాడుకోవడం ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు అలవాటైపోయిందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం మండపాకలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. పొలంలో ఉన్న పంటకు నష్టం జరిగితే నిబంధనల ప్రకారం సబ్సిడీ చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఈ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విత్తనాల కోసం సేకరించిన నమూనాలను పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని కొలిచే యంత్రాల పనితీరుపై ఆరా తీశారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ టీ శివరామప్రసాద్, జిల్లా సహకార అధికారి రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ భరణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ డ్రైవర్‌ను కాపాడిన సీఐ



చికిత్సతో కోలుకున్న వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న సీఐ అంకబాబు

నూజివీడు: అకస్మాత్తుగా గ్యాస్ నొప్పితో రోడ్డుపై గిలగిల్లాడుతున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్‌కు త్వరగా వైద్యం అందేలా చొరవ తీసుకున్న సీఐ ఆర్.అంకబాబు సేవలను పలువురు ప్రశంసించారు. వివరాల్లోకి వెళితే.. దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొనేందుకు రూరల్ సీఐ ఆర్.అంకబాబు గొల్లపల్లి వెళుతుండగా గొల్లపల్లి, మొర్సపూడి గ్రామాల మధ్యలో వెంకటేశ్వరరావు అనే ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను పక్కన ఆపి చేతులతో గుండెను పట్టుకొని కింద పడిపోయి కొట్టుకుంటున్న దృశ్యాన్ని చూశారు. వెంటనే విషయం తెలుసుకుని బాధితుడిని కారులో ఎక్కించుకుని నూజివీడుకు తీసుకెళుతూ గొలపల్లిలో ఆర్‌ఎంపీకీ ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. గొల్లపల్లి చేరుకోగానే ఆర్‌ఎంపీ వైద్యం అందించడంతో వెంకటేశ్వరరావు కొద్ది నిమిషాలకు తేరుకున్నాడు. సకాలంలో స్పందించి తన ప్రాణాలు కాపాడటంతో బాధితుడు వెంకటేశ్వరరావు సీఐ అంకరాజుకు కృతజ్ఞతలు తెలిపాడు.

విధుల్లో నిద్రపోయిన ముగ్గురు గార్డుల సస్పెన్షన్

ఏలూరు టౌన్: భీమడోలు సర్కిల్ పరిధిలోని ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో గార్డ్ డ్యూటీలో తీవ్ర అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు సిబ్బందిపై జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటంతోపాటు, విధుల్లో క్రమశిక్షణతో పనిచేయాలని చెప్పారు. ద్వారకా తిరుమల టికెట్ల రీప్రింట్ స్కామ్‌లో నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ సెల్‌లో ఉంచారు. గార్డ్‌డ్యూటీ చేస్తున్న హోంగార్డు ఎన్.వెంకటరత్నం, కానిస్టేబుల్స్ డీ.ఠాగూర్ వరప్రసాద్, జీ.రవికుమార్ తెల్లవారుజామున విధుల్లో ఉంటూ నిద్రపోయినట్లు పోలీస్ అధికారులు ఫిర్యాదు చేశారు. ఏలూరు నుంచి తెల్లవారుజామున ద్వారకాతిరుమల వెళ్లిన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అధికారి విధుల్లో వారు ముగ్గురూ నిద్రపోతున్నట్లు గుర్తించటంతో జిల్లా ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై విచారణ అనంతరం ముగ్గురిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఉత్తర్వులు ఇచ్చారు.

గోపీజనలోల.. గోవర్ధనోద్ధార

- భక్తుల అభీష్టాలు తీర్చే దైవం పారిజాతగిరివాసుడు
- 12 నుంచి పారిజాతగిరి ఆలయంలో బ్రహ్మోత్సవాలు
- 15న కల్యాణోత్సవం, 16న గరుడోత్సవం, ఏర్పాట్లు పూర్తి



శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం



శ్రీవెంకటేశ్వరస్వామి



హైవే నుంచి వచ్చే దారిలో ఆలయ ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఆర్చ్

జంగారెడ్డిగూడెం: భక్తుల అభీష్టాలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతూ భక్తులతో నిత్యపూజలందుకుంటున్నాడు గోకుల తిరుమల పారిజాతగిరిలో కొలువైన శ్రీవెంకటేశ్వరస్వామి. తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు సైతం ఇక్కడ శ్రీ గోకుల తిరుమల పారిజాతగిరిలో నిర్వహిస్తున్నారు. దీంతో పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానమంతా ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. జాతీయ రహదారి (516డి)ని ఆనుకుని ఆహ్లాదకరమైన పరిసరాలతో ప్రశాంత వాతావరణంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.

చరిత్ర ఇదే..

చిట్టియ్య అనే భక్తునికి వేంకటేశ్వరుడు కలలో కనిపించి జంగారెడ్డిగూడెంకు ఉత్తరాన ఉన్న కొండల్లో తన పాదాలు వెలుస్తాయని, ఆ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించాలని తెలిపారు. ఆ విధంగా చిట్టియ్య అన్వేషించగా, ఉత్తరం వైపున ఉన్న ఏడు కొండలలో 6వ కొండపై పారిజాతగిరి వృక్షం కింద స్వామి వారి పాదాలు గల శిలను గుర్తించి అక్కడ చిన్న ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి భక్తుల అభీష్టాలు తీర్చుతూ ఆలయం దినదినప్రవర్ధమానమైంది. పాడిపంటలు కలిగిన ప్రదేశం కావడంతో గోకులం అని, పారిజాతగిరి వృక్షాలు కొండపై ఉండటంతో పారిజాతగిరి అని, వేంకటేశుడు కొలువై ఉన్నందున తిరుపతి అని గోకుల తిరుమల పారిజాతగిరిగా ప్రసిద్ధిగాంచింది.

తిరుమల తరువాత ఇక్కడే..

తిరుమలలో ఏడుకొండలపైన వెంకటేశ్వరుడు వెలవగా, పారిజాతగిరిలోనూ ఏడు కొండలలో ఒక కొండపై పారిజాతగిరి వాసుడు పాదపద్మాలు అవతరించాయి. దీంతో అప్పటి నుంచి ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. పారిజాతగిరి వాసుడికి ఎదురుగా గరుడకొండ ఉంది. ఏడుకొండల్లో శేషాద్రి, వృషాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి, వృషభాద్రి ఏడుకొండలు ఇక్కడ ఉన్నాయి.

ప్రదక్షిణ విశిష్టత

గిరి ప్రదక్షిణతో పుణ్యఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుడు వెలసిన ప్రదేశానికి విశిష్ట ప్రాధాన్యత ఉంది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, కార్యదర్శి కాకాని శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు రూ.30 లక్షలు వెచ్చించి గోకుల పారిజాతగిరి ఆరు కొండల చుట్టూ గిరిప్రదక్షిణ తాత్కాలిక రోడ్డును నిర్మించారు. దీనికి కొంత మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కూడా ఆర్థిక సహాయం అందింది. కొండ చుట్టూ ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే త్వరలో దాతల సహకారంతో పూర్తిస్థాయి శాశ్వత రోడ్డును నిర్మించనున్నారు. ఈ తరహా గిరి ప్రదక్షిణ సుప్రసిద్ధ దేవాలయాలు అరుణాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తిలో మాత్రమే ఉన్నాయి. కాగా ఈ ఆలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం, మే నెలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి తరహాలోనే పారిజాతగిరికి కూడా మెట్ల మార్గం ఉండటం విశేషం.

12 నుంచి బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. తొలి రోజు సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు శేషవాహన సేవ, 14వ తేదీ రాత్రి 8 గంటలకు హనుమంతవాహన సేవ, 15వ తేదీ ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు గరుడోత్సవం (గ్రామోత్సవం), 17వ తేదీ ఉదయం 9 గంటలకు చక్రస్నానం, రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, 9 గంగటలకు ధ్వజారోహణం , 18న ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 12వ తేదీ నుంచి 18 వరకు వారం పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నాం. 15వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఆలయ మాఢవీధుల్లో అర్చకుల వేద మంత్రాల నడుమ స్వామి వారికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నాం.

– ఎం.రాంబాబు, ఈఓ, గోకుల తిరుమల పారిజాతగిరి, జంగారెడ్డిగూడెం

గోనె సంచుల కొరత రానివ్వం

- ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు
- సొంత ఖర్చుతో రైతులకు సంచుల పంపిణీ ప్రారంభం



వరంగల్ నుంచి లారీలో వచ్చిన గోనె సంచులు

పెనుగొండ: అకాల వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు తన సొంత ఖర్చులతో గోనె సంచుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మే ఒకటో తేదీ నుంచి కురిసిన వర్షాలతో ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులకు ఒకేసారి గోనె సంచులు అవసరమయ్యాయి. దీంతో వాటికి కొరత ఏర్పడింది. ఎప్పుడూ రైతులకు అండగా నిలిచే శ్రీరంగనాథరాజు వారి సమస్యలను తెలుసుకుని రూ.2 కోట్లతో దాదాపుగా 10 లక్షల సంచులను వరంగల్, ఏలూరు ప్రాంతాల నుంచి కొనుగోలు చేశారు. వీటిలో కొంత మేర సంచులు రావడంతో ఆచంటలో రైతులకు ముందుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. నియోజకవర్గంలో ఎక్కడా సంచుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను శ్రీరంగనాథరాజు ఆదేశించారు. నిత్య పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు రైతులకు సంచులు అందించి కోసిన ధాన్యాన్ని నేరుగా మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా అధికారులు మిల్లుల వద్దకే వెళ్లి సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని సూచించారు. తొలివిడతగా ఆచంట, పోడూరు మండలాలకు గోనే సంచుల పంపిణీని తూర్పుపాలెం కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. అవసరమైతే మరిన్ని సంచులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కేవలం విమర్శలతో కాలం వెళ్లబుచ్చే ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలను పట్టించుకోవద్దని రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి సొంత ఖర్చులతో గోనే సంచులు ఏర్పాటు చేసిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

బుట్టాయగూడెం: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూసరాజుపల్లి బాలికల కళాశాలలో సీట్లు భర్తీ చెయ్యాల్సి ఉందన్నారు. వీటిలో ఎంపీసీ 45, బైపీసీ 45, హెచ్‌ఈసీ 45, ఏఅండ్‌టి 20 చొప్పున సీట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే గురుకుల బాలుర కళాశాల కేఆర్‌పురంలో 180 సీట్లు భర్తీ చెయ్యనున్నట్లు తెలిపారు. వీటిలో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్‌ఈసీ 40, ఏఅండ్‌టీ 20, అదేవిధంగా గురుకుల బాలుర కళాశాల జీలుగుమిల్లిలో 180 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఎంపీసీ 45, బైపీసీ 45, సీఈసీ 45, హెచ్‌ఈసీ 45 చొప్పున ఖాళీలు భర్తీ చెయ్యడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 12వ తేదీ నుంచి 31వ తేదీలోపు ఆయా కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. అలాగే విద్యార్థులకు 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు దగ్గరలోని గురుకుల పాఠశాలలో తమ దరఖాస్తులను ఉచితంగా ఆన్‌లైన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నూజివీడు: మేనమామ ఇంటికి వచ్చిన ఓ యువతి ఈనెల 6న అదృశ్యమైన ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణా జిల్లా గుడివాడలో నైజాంపేటకు చెందిన 21 ఏళ్ల యువతి గొల్లపల్లిలోని మేనమామ ఇంటికి వచ్చింది. అయితే ఈనెల 6న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఎవరికైనా యువతి ఆచూకీ తెలిస్తే 94407 96440 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన డీఎస్సీ-98 టీచర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తమకు ఉద్యోగాలు కల్పించడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఎస్సీ–98 క్వాలిఫైడ్ టీచర్ల అసోసియేషన్ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఉద్యోగాలు పొందిన నాయకులు, సభ్యులు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 1998 డీఎస్సీలో మిగిలిన 112 మందికి కూడా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పి.బెనర్జీ, కె.విజయ, పి.నాగవల్లి జి.ఆనందకుమారి, కె.రమాప్రభ పాల్గొన్నారు.

గోదత్తత ప్రక్రియ పునః ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గోదత్తత ప్రక్రియను పునఃప్రారంభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లంపి స్కిన్ వ్యాధి కారణంగా కొండపైన శ్రీవారి గోసంరక్షణ శాలలో కొద్ది నెలలుగా గోదానం, గోదత్తత ప్రక్రియను నిలుపుదల చేశారు. ప్రస్తుతం గోవుల ఆరోగ్యం బాగున్నందున వాటిని గతంలో వలె దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రతి నెలా రెండో, నాలుగో శనివారాల్లో దత్తత ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే భక్తుల నుంచి గోదానం కింద గోవులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. కావున భక్తులు, రైతులు గమనించాలని ఆయన కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అసాంఘిక శక్తులను అణచివేయండి

- ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- ఏడు జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్‌లో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఉంచి అణచివేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరులోని రేంజ్ కార్యాలయం నుంచి ఆయన బుధవారం ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పుగోదావరి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సమాజానికి చేటు చేసే అరాచక శక్తులను ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దిశ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ గ్రామ సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీస్) సేవలను వినియోగించుకుంటూ మహిళలపై నేరాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తలు వహించేలా ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సైబర్ కేసులను దర్యాప్తు చేయాలన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో శాంతిని నెలకొల్పేలా చూడాలన్నారు. ఈనెల 13న మెగా లోక్ ఆదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులకు సంబంధించి కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులను డీఐజీ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్, అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, అదనపు ఎస్పీలు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



పెదవేగి : కొప్పులవారిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

వైద్య సిబ్బంది సకాలంలో స్పందించాలి

పాలకొల్లు అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది సకాలంలో స్పందించాలని జిల్లా వైద్యాధికారి డా. మహేశ్వరరావు కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి గర్భిణులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణులను సర్వే ద్వారా గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం వెంకటాపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో వైద్య బృందం అప్రమత్తంగా ఉండాలన్నారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేయాలని కోరారు. మెడికల్ ఆఫీసర్లు డా. అడ్డాల ప్రతాప్‌కుమార్, డా.నవ్యజీవన్, డా.భవానీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకరరావు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.